సాక్షి
తూర్పుగోదావరి

గురువారం | 3 | ఏప్రిల్ | 2025



బాలికా విద్యకు భరోసా

పేద, అనాథ బాలికల కోసం ఏర్పాటు చేసిన కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ) వారి విద్యకు భరోసాగా నిలుస్తున్నాయి. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా బోధన చేస్తున్నాయి.


8 లో



స్నానానికి దిగి మృత్యు ఒడికి..

ఏలేరు కాలువలో స్నానానికి దిగి నలుగురు మృత్యువాత పడ్డారు. అప్పటి వరకూ స్నేహితులు, కుటుంబ సభ్యులతో గడిపిన వారు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు.

డెల్టా కాలువలకు 10,700 క్యూసెక్కులు



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 10,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,200, మధ్య డెల్టాకు 2,000, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 9.30 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

నేడు సమ్మర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్

రాజమహేంద్రవరం సిటీ: జిల్లా మీదుగా గురువారం వన్‌వే సమ్మర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు నడిపేందుకు చర్యలు చేపట్టినట్టు రైల్వే అధికారులు బుధవారం ప్రకటించారు. 07011 చర్లపల్లి- విశాఖపట్నం మధ్య నడిచే ఈ రైలు గురువారం చర్లపల్లిలో బయలుదేరి శుక్రవారం విశాఖపట్నం చేరుకుంటుందని అధికారులు ప్రకటించారు. ఈ రైలు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం, సామర్లకోట, అన్నవరం, తుని రైల్వే స్టేషన్లో ఆగనుందని తెలిపారు.

నేటి నుంచి పదవ తరగతి స్పాట్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పదో తరగతి పరీక్షల మూల్యాంకనం జిల్లాలో గురువారం నుంచి జరగనుంది. ఆ వివరాలను డీఈవో కె.వాసుదేవరావు బుధవారం తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పదవ తరగతి మూల్యాంకనం ప్రారంభమవుతుంది. అందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. చీఫ్ ఎగ్జామినర్స్ 101 మంది, అసిస్టెంట్ ఎగ్జామినర్స్ 630 మంది, స్పెషల్ అసిస్టెంట్స్ 201 మంది పనిచేయనున్నారు.

ఫార్మసీ విద్యార్థి ఆరోగ్య పరిస్థితిపై హెల్త్ బులెటిన్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ఫార్మసీ విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉందని ప్రభుత్వాసుపత్రి వైద్య బృందం తెలిపింది. ఆమె ఆరోగ్య పరిస్థితిపై ప్రభుత్వ వైద్య బృందం బుధవారం హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. రోగి అపస్మారక స్థితికి వచ్చిందని, ఈ కారణంగా ఐసీయూలో వెంటిలేటర్ ద్వారా చికిత్స అందుతోందన్నారు. రక్తపోటు, పల్స్, శ్వాసక్రియ తక్కువగా ఉన్నాయన్నారు. ఏసీఎల్ఎస్ మార్గదర్శకాల ప్రకారం కార్డియోపల్మనరీ రెసిటేషన్ సీపీఆర్ ఇచ్చారన్నారు. సుదీర్ఘ చికిత్స తర్వాత స్వల్పంగా శరీర స్పందన తిరిగి వచ్చిందన్నారు. చికిత్సలో భాగంగా ఎమ్ఆర్ఐ, సీటీ స్కాన్, ఈసీజీ, కార్డియాలజీ, న్యూరాలజీ పరీక్షలు చేశారన్నారు. మెదడు తీవ్రంగా పాడైపోయిందన్నారు.

ప్రవీణ్ మృతదేహానికి రీ పోస్ట్‌మార్టమ్ నిర్వహించాలి

రాజమహేంద్రవరం సిటీ: పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై పలు అనుమానాలు నెలకొన్న నేపథ్యంలో రీపోస్ట్ మార్టమ్ నిర్వహించేందుకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌కు, జిల్లా ఎస్పీకి నివేదించినట్లు అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ తెలిపారు. బుధవారం ఈ మేరకు విలేకరులకు కలెక్టర్, ఎస్పీలకు అందజేసిన లేఖను విడుదల చేశారు. రీ పోస్ట్‌మార్టమ్‌ను తెలంగాణలో నిర్వహించాలని దరఖాస్తు చేసినట్లు తెలిపారు.

సామర్లకోట చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి రంగం సిద్ధం

సామర్లకోట: పట్టణ మున్సిపల్ కౌన్సిల్‌లో బల నిరూపణకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని వైఎస్సార్ సీపీకి చెందిన కౌన్సిలర్లు బుధవారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్యకు వినతి పత్రాలు అందజేశారు. కొంత కాలంగా చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ తీరుపై అదే పార్టీకి చెందిన కౌన్సిలర్లు అసంతృప్తితో ఉన్నారు. దాంతో 31 మంది సభ్యులు ఉన్న కౌన్సిల్ సభ్యులలో 22 మంది సంతకాలు చేసి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని వినతి పత్రాలు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య విలేకర్లతో మాట్లాడుతూ సగానికి మించి సభ్యులు బల నిరూపణ కోసం వినతి పత్రం అందజేస్తే దానిపై నిర్ణయం తీసుకోవలసి ఉంటుందన్నారు. బలనిరూపణ సమావేశం ఏర్పాటుకు కలెక్టరు నుంచి ఆదేశాలు రావలసి ఉందన్నారు. వినతి పత్రంలో సంతకాలు చేసిన వారి నుంచి సమాచారం సేకరించి తదుపరి నిర్ణయం తీసుకొంటారన్నారు. వైస్‌చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీసత్యనారాయణ, పాగా సురేష్‌కుమార్, నేతల హరిబాబు, యార్లగడ్డ జగదీష్, వైఎస్సార్ సీపీ నాయకుడు రెడ్నం దొరబాబు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై 9న విచారణ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ ఉన్నీసాబీబీపై జిల్లా పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టనున్నారు. కాకినాడ రూరల్ మండలం వాకలపూడి గ్రామ పంచాయతీలో పని చేసిన సమయంలో ఒక ఇంటి పన్ను మార్పులపై ఆమెపై వచ్చిన అవినీతి అభియోగాలపై ఏసీబీ, జిల్లా పంచాయతీ అధికారులు సంయుక్తంగా ఈ నెల 9న ఉదయం 11 గంటలకు ఈ విచారణ చేపట్టనున్నారు. జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, ఏసీబీ సీఐ ఈ విచారణ చేపట్టనున్నారు. గతంలో ఆమెపై వచ్చిన అవినీతి ఆరోపణలపై నిజనిర్ధారణ కోసం ఈ విచారణ సాగనుంది.

పట్టణాలకు పన్నుపోటు

- ఎన్నికల సమయంలో మున్సిపాలిటీల్లో పన్ను తగ్గిస్తామన్న కూటమి నేతలు
- అధికారంలోకి వచ్చాక 15 శాతం పెంచుతూ నిర్ణయం
- వడ్డీ రాయితీ 50 శాతమే వర్తింపు
- వెరసి పన్ను వసూళ్లలో మందగమనం
- 50 శాతానికి మించి వసూలు కాని వైనం
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 100 శాతం రాయితీ



రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయం

సాక్షి, రాజమహేంద్రవరం: 'ఏరుదాటే వరకు ఓడ మల్లన్న.. ఏరు దాటాక బోడి మల్లన్న' అన్న చందంగా తయారైంది కూటమి నేతలు, ప్రభుత్వం తీరు. సార్వత్రిక ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చేందుకు ఏటా పెంచే 15 శాతం పన్ను తాము అధికారంలోకి వస్తే తగ్గిస్తామని హామీలు గుప్పించారు కూటమి నేతలు. అధికార పగ్గాలు చేపట్టాక అమలు మరిచారు. వెరసి పట్టణాల్లో పన్నుభారంతో ప్రజలు సతమతం అవుతున్నారు. దీనికితోడు పన్నులు చెల్లించే ప్రజలకు 100 శాతం వడ్డీ రాయితీ అమలు చేయాల్సి ఉన్నా.. కేవలం 50 శాతానికి మాత్రమే పరిమితం చేసింది. అది కూడా చెల్లింపుల గడువు ముగిసే చివరి ఐదు రోజులు మాత్రమే అవకాశం కల్పించడంతో పన్నుల వసూళ్లలో మందగమనం ఏర్పడింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 50 శాతం మాత్రమే పన్నులు వసూలయ్యాయి.

ఇదీ సంగతి

ఇంటి, కుళాయి, ఖాళీ స్థలాలు తదితర పన్నుల వసూళ్లపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో నగరపాలక సంస్థ అధికారులతో విస్తృత ప్రచారం చేపట్టింది. పన్నులు చెల్లించకపోతే కుళాయి కనెక్షన్లు కట్ చేస్తామని హెచ్చరికలు సైతం జారీ చేసింది. పన్నుల వసూళ్లకు ప్రత్యేకంగా అధికారులను నియమించారు. వారిని ఇళ్ల వద్దకు పంపి దాదాగిరీ చేసే విధానానికి తెర తీసింది. అప్పటికీ వసూళ్లలో వేగం పుంజుకోకపోవడంతో సరికొత్త ఆలోచనకు నాంది పలికింది. పన్నులు చెల్లించిన వారికి 50 శాతం వడ్డీ రాయితీ కల్పిస్తామని ప్రకటనలు చేసింది. అది కూడా పూర్తిగా అమలు చేయలేదు. పన్నుల వసూళ్ల గడువు కేవలం ఐదు రోజులు ఉండనగా ప్రకటించారు. ఈ ఆఫర్ ఉందని ప్రజలు తెలుసుకునేలోపే సమయం ముగియడంతో రాయితీతో పెద్దగా ప్రయోజనం కలిగిన దాఖలాలు లేవు. రాయితీ సైతం మొత్తం బకాయిలు చెల్లించిన వారికే వర్తింపజేయడంతో పన్నుల చెల్లింపులపై పట్టణ ప్రజలు ఆసక్తి చూపలేదు. వెరసి పన్ను వసూళ్లు 50 శాతం మాత్రమే జరిగినట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి.

కుళాయి పన్నులపై తీవ్ర ఒత్తిడి

కుళాయి పన్నులపై మున్సిపల్ అధికారులు ప్రజలపై తీవ్ర ఒత్తిడి పెంచారు. ఒకటి, రెండు కాదు పదేళ్ల కుళాయి పన్ను చెల్లింపునకు ఒకేసారి డిమాండ్ నోటీసులు ఇచ్చారు. గతంలో ఎన్నడూ లేని సంప్రదాయానికి తెర తీశారని జనం వాపోతున్నారు. కుళాయిలకు ప్రతి నెలా రూ.100 నీటి చార్జీలు మున్సిపాలిటీ, కార్పొరేషన్లు వసూలు చేస్తున్నాయి. ఏడాదికి రూ.1,200 ఇంటి పన్నుతో పాటు చెల్లించాల్సి ఉంది. కేవలం ఇంటి పన్ను వసూళ్లపై మాత్రమే దృష్టి సారించిన మున్సిపల్ అధికారులు కుళాయి పన్నులను పట్టించుకోలేదు. దీంతో ఆ బకాయిలు పేరుపోవడం.. ఒక్కసారి పదేళ్ల కుళాయి పన్ను చెల్లించాలని చెప్పడంతో ప్రజలు అవాక్కవుతున్నారు. ఒక్కసారిగా అంతమొత్తం చెల్లించాలంటే ఎలాగని ప్రశ్నించినా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. పైగా కుళాయి కనెక్షన్లు కట్ చేయడంతో తాగునీటి కోసం తాము ఎక్కడికి వెళ్లాలని ఆందోళన చెందుతున్నారు. కట్టకపోతే కేసులు బనాయిస్తామని బెదిరించిన సందర్భాలు సైతం లేకపోలేదు. కుళాయిలున్న కుటుంబాలో అత్యధిక శాతం పేద, మధ్య తరగతి ప్రజలే ఉన్నారు. ఒక్కసారిగా అంత మొత్తం చెల్లించాలంటే కష్టం.

గత ప్రభుత్వ హయాంలో 100 శాతం రాయితీ

కార్పొరేషన్, మున్సిపాలిటీల అభివృద్ధికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేసింది. రూ.కోట్లతో అభివృద్ధి పనులకు నాంది పలికింది. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో పన్ను బకాయిల వసూళ్లలో ప్రజలు ఆర్థిక ఇబ్బందులను దూరం చేసేందుకు 100 శాతం వడ్డీ రాయితీ కల్పించింది. ప్రస్తుత ప్రభుత్వంలా కేవలం 5 రోజుల సమయం మాత్రమే ఇవ్వకుండా నెల రోజుల పాటు రాయితీ ద్వారా పన్నులు చెల్లించేందుకు అవకాశం కల్పించేవారు. ప్రభుత్వ చర్యలతో ప్రతి ఏటా 90 శాతానికి పైగా పన్నులు వసూలయ్యేవి. ప్రజలకు వడ్డీ భారం తగ్గి ఊరట కలిగేది. మున్సిపాలిటీలకు సైతం ఆదాయం సమకూరడంతో అభివృద్ధి పనులు వేగంగా జరిగేవి.

పన్నుల వసూళ్లు ఇలా..

ఏటా పన్ను వసూళ్లు ఏప్రిల్ నుంచి సెప్టెంబర్, అక్టోబర్ నుంచి మార్చి వరకు రెండు దఫాలుగా పరిగణించి చేపడతారు. నిర్దేశించిన సమయంలో చెల్లించకపోతే రూ.100కు రూ.2 చొప్పున వడ్డీ వసూలు చేస్తారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా పన్నుల వసూళ్లు ఇలా...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా రాజమహేంద్రవరం, కాకినాడ కార్పొరేషన్లు ఉండగా.. 9 మున్సిపాలిటీలు, 3 నగర పంచాయతీలు ఉన్నాయి. పన్నుల వసూళ్లలో ఒక్క కొవ్వూరు మున్సిపాలిటీ మినహా మిగిలిన వాటిల్లో పన్నుల వసూళ్లలో మందగమనం కనిపిస్తోంది. రాజమహేంద్రవరంలో అత్యధిక శాతం రూ.132.32 కోట్ల డిమాండ్ ఉంటే.. రూ.71.09 కోట్లు మాత్రమే వసూలయ్యాయి.

మున్సిపాలిటీ	డిమాండ్ (రూ.కోట్లలో)	వసూళ్లు (రూ.కోట్లల్లో)	వసూలైన శాతం
కాకినాడ	110.99	52.97	47.72
పిఠాపురం	10.17	4.97	48.90
సామర్లకోట	8.78	4.47	50.93
రాజమహేంద్రవరం	132.32	71.09	53.73
నిడదవోలు	8.47	4.72	55.72
ఏలేశ్వరం	2.61	1.49	57.12
అమలాపురం	14.72	9.01	61.19
రామచంద్రాపురం	7.65	4.93	64.46
పెద్దాపురం	7.18	4.72	65.81
కొవ్వూరు	4.56	3.69	81.04

టిడ్కో ఇళ్లు ఇవ్వడంలో జాప్యం ఎందుకు?

సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు



టిడ్కో ఏఈతో మాట్లాడుతున్న మధు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు-2లో 1,200 టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ లబ్ధిదారులకు ఇవ్వడంలో జాప్యం ఎందుకు చేస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మించిన ఇళ్ల పాడవుతున్నాయని ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం అవుతోందన్నారు. బుధవారం సీపీఐ రాజకీయ ప్రచార జాత 8వ రోజు లో భాగంగా బొమ్మూరు 2 లో టిడ్కో గృహాలను పరిశీలించారు. అనంతరం టిడ్కో ఏఈ అనంతలక్ష్మితో మాట్లాడి ఇళ్ల లబ్ధిదారులు ఇబ్బందులపై చర్చించారు. అనంతరం ఫేజ్- 1 లో ఉన్న టిడ్కో గృహాలు, బొమ్మూరు సెంటర్ మార్కెట్ తదితర ప్రాంతాల్లో ప్రచార జాత నిర్వహించారు. మధు మాట్లాడుతూ బొమ్మూరు ఫేజ్-1 లో 2,528 గృహాలు నిర్మించారని కానీ 75శాతం మాత్రమే నివసిస్తున్నారని, ఫేజ్-2 లో 1,200 గృహాలు నిర్మించి ఆరు సంవత్సరాలు అవుతున్నా లబ్ధిదారులకి అందజేయకపోవడం దారుణం అన్నారు. బ్యాంకులకు రుణం సొమ్ము కడుతూ, ఇల్లు అందక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందజేయాలని లేని పక్షంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ నాయకత్వంలో మేమే వారికి అందజేస్తామని మధు తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ జట్లు లేబర్ యూనియన్ అధ్యక్షుడు కుండ్రపు రాంబాబు, సీపీఐ నగర కార్యదర్శి వి.కొండల రావు, నగర సహాయ కార్యదర్శి సప్ప రమణ, టౌన్ కమిటీ సభ్యులు పి.లావణ్య, టి నాగేశ్వరరావు, టీ త్రిమూర్తులు, జట్టు సంఘం అధికారి బాడీ సభ్యులు అప్పలనాయుడు, బాలకృష్ణ, వెంకట్రావు పాల్గొన్నారు.

వ్యర్థాలతో రిలయన్స్ బయో ఎనర్జీ ప్లాంట్



రిలయన్స్ బయో ఎనర్జీ ప్లాంట్ ఆవరణ

వర్చువల్ విధానంలో ప్రారంభించిన మంత్రి లోకేశ్

సామర్లకోట: స్థానిక ఏడీబీ రోడ్డులోని రిలయన్స్ పవర్ ప్లాంటు సమీపంలో రిలయన్స్ బయో ఎనర్జీ ప్లాంట్‌ను బుధవారం ఆన్‌లైన్ (వర్చువల్ విధానంలో)లో ప్రారంభించారు. డ్రోన్ కెమెరా ద్వారా ఫ్యాక్టరీ పరిసరాలను రిలయన్స్ అధినేతలు, మంత్రి లోకేశ్ తిలకించే విధంగా ఏర్పాట్లు చేశారు. సుమారు రూ.375 కోట్ల వ్యయంతో నిర్మించే ప్లాంటులో వరి, చెరకు, మొక్కజొన్న, ఆయిల్‌పామ్, పూలతోటలు, ఆక్వా సముదాయాల నుంచి వచ్చే వ్యర్థాలు, పశువుల పేడతో 'కంప్రెస్డ్ బయో గ్యాస్' ఉత్పత్తి చేయడానికి ఈ యూనిట్ ఏర్పాటు చేశారు. సుమారు 60 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించే మూడు యూనిట్ల ద్వారా రోజుకు 67.53 టన్నుల గ్యాస్ ఉత్పత్తి చేయనున్నట్లు రిలయన్స్ బయో ఎనర్జీ ప్లాంట్ ప్రతినిధులు తెలిపారు. బయో ఎనర్జీ మొదటి యూనిట్ ప్లాంటుకు రూ.114.20 ఖర్చు చేసినట్టు ఫ్యాక్టరీ ప్రతినిధులు చెప్పారు. మిగిలిన రెండు యూనిట్లు ఆగస్టు నాటికి ఉత్పత్తిని ప్రారంభిస్తాయని తెలిపారు.

మానవుల శ్రేయస్సు కోసమే యాగాలు



ప్రసంగిస్తున్న శ్రీరామ చంద్ర సోమయాజులు

అల్లవరం: యజ్ఞయాగాల పరమార్థం సర్వమానవాళి శ్రేయస్సు అని భీమవరం మావుళ్లమ్మ అమ్మవారి ఆలయ వేద ఉపవాచకులు ఈవని శ్రీరామచంద్ర సోమయాజులు అన్నారు. అల్లవరం మండలం దేవగుప్తం గ్రామంలో వేద పండితుడు మరువాడ వెంకటేశ్వరశర్మ పర్యవేక్షణలో పోచినపెద్ది శ్యామ్ శర్మ ఆధర్యంలో జరుగుతున్న నక్షత్ర పూర్వక నవగ్రహ శివ పంచాయతన యాగానికి ఆయన బుధవారం ముఖ్యఅతిథిగా విచ్చేశారు. తొలుత శివ పంచాయతన యాగం మూడో రోజున ఉమాపార్వతీ మల్లేశ్వర స్వామివారికి అన్నాభిషేకం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి కుంకుమ పూజ చేశారు. అనంతరం 27 నక్షత్రాలకు నవగ్రహ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమయాజులు మాట్లాడుతూ శివ పంచాయత యాగం విశిష్టతను తెలిపారు. హైందవ జాతిని ఉద్ధరించడానికి జగద్గురు ఆది శంకరాచార్యులు ఉద్భవించారని, ఆయనతోనే ఈ జాతి మనుగడ సాగుతోందన్నారు. అనంతరం భక్తులు ఆయన ఆశీస్సులు పొందారు.

టీడీపీ విమర్శలు భావ్యం కాదు

- ఫార్మసీ విద్యార్థినికి న్యాయం జరగాలన్నదే మా తపన
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళ నాయకురాలు లక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళ నాయకురాలు మార్తి లక్ష్మి

రాజమహేంద్రవరం సిటీ: మృత్యువుతో పోరాడుతున్న ఫార్మసీ విద్యార్థినికి, వారి కుటుంబానికి న్యాయం జరగాలన్న తపనతో మాజీ ఎంపి మార్గాని భరత్‌రామ్ పోరాడుతున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళ నాయకురాలు మార్తి లక్ష్మి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థిని కుటుంబానికి అండగా నిలిచి తమ పార్టీ నాయకులు పోరాడుతుంటే శవ రాజకీయాలంటూ తెలుగు మహిళలు విమర్శించడం భావ్యం కాదన్నారు. శవ రాజకీయాలు అంటూ వ్యాఖ్యానిస్తున్నారంటే విద్యార్థి చనిపోయిందనే భావనలో తెలుగు మహిళలు ఉన్నారా అని నిలదీశారు. తమ నాయకుడు మార్గాని భరత్ రామ్ ఆసుపత్రి వద్దకు వెళ్ళి ఆందోళనకు దిగితే తప్ప పోలీసు యంత్రాంగం, ప్రభుత్వం స్పందించలేదని అన్నారు. సిటీ ఎమ్మెల్యే ముందుగానే స్పందించి, న్యాయం చేస్తామని ప్రకటించకపోవడం దారుణమన్నారు. ఈ కేసులో ఎన్నో అనుమానాలు ఉన్నాయని, ఇంజెక్షన్ ఆమె చేసుకుందా? ఇంకెవరైనా చేశారా అన్నది తెలియాలంటే ఆసుపత్రిలో సీసీ పుటేజ్ ఇవ్వాలని తమ పార్టీ నాయకులు డిమాండ్ చేస్తున్నారన్నారు. దీపక్‌ను ఎమ్మెల్యే దగ్గరుండి అరెస్ట్ చేయించినట్లు మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. మహిళలకు అన్యాయం జరిగితే తాట తీస్తామన్న పవన్‌కళ్యాణ్ ఈ ఘటనపై ఎందుకు స్పందించలేదన్నారు. ఈ ఘటనపై ఇప్పటి వరకు మహిళా హోం మంత్రి స్పందించకపోవడం శోచనీయమన్నారు. మహిళా నేతలు అనుయాదవ్, మార్గాని సుశీల, అర్నాభట్టు అనంతలక్ష్మి, రమణమ్మ, చిన్నారి పాల్గొన్నారు.

లక్ష్యానికి చేరువగా సెస్ వసూళ్లు

- 2024-25లో 94.37 శాతం వసూలు
- నిడదవోలు ఏఎంసీలో రికార్డు స్థాయిలో 119.62 శాతం
- వెనుకంజలో 62.03 శాతంతో కొవ్వూరు ఏఎంసీ



నిడదవోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

రాజమహేంద్రవరం రూరల్: వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ)ల ఆధ్వర్యాన వ్యవసాయ ఉత్పత్తులపై సెస్, మార్కెట్ ఫీజు వసూళ్లలో జిల్లా నూరు శాతం లక్ష్యం చేరుకోలేదు. ప్రస్తుతం 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.30.83 కోట్లు లక్ష్యంకాగా మార్చినెలాఖరు నాటికి రూ. 29.09 కోట్లు మేర వసూళ్లు జరిగాయి. జిల్లావ్యాప్తంగా 94.37శాతం మార్కెటింగ్ ఫీజులు వసూలయ్యాయి. వ్యవసాయ ఉత్పత్తులు, పశుగణాలపై ఒక శాతం సెస్ వసూలు చేస్తున్నారు. వీటితోపాటు వ్యాపారుల (ట్రేడర్ల) నుంచి ఒక శాతం, చేపలు, రొయ్యలపై 0.25 శాతం చొప్పున సెస్ వసూలు చేస్తున్నారు. నిడదవోలు ఏఎంసీ రూ.1.50 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా ఏకంగా రూ.1.79 కోట్లు వసూలు చేసి ముందంజలో ఉంది. నిడదవోలు ఏఎంసీ పరిధిలో ప్యాడీతో పాటు సెస్ వసూళ్లు బాగా చేయడంతో ముందంజలో నిలిచింది. కొవ్వూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ సెస్ 62.03 శాతం వసూలు చేసి వెనుకంజలో ఉంది.

నాలుగు ఏఎంసీలు వందశాతం పైనే

జిల్లాలో ఆరు ఏఎంసీల్లో నాలుగు ఏఎంసీల్లో నిడదవోలు 119.62 శాతం వసూళ్లతో ప్రథమ స్థానంలో ఉండగా, గోపాలపురం ఏఎంసీ 110.11 శాతం వసూళ్లతో ద్వితీయ స్థానం, రాజానగరం ఏఎంసీ 109.76 శాతం వసూళ్లతో తృతీయ స్థానం, అనపర్తి ఏఎంసీ 100.86 శాతం వసూళ్లతో నాలుగో స్థానంలోను, నిలిచాయి. రాజమహేంద్రవరం మార్కెట్ కమిటీ 78.98 శాతం వసూళ్లతో ఐదవ స్థానంలో కొవ్వూరు ఏఎంసీ 62.04 శాతం వసూళ్లతో చివరి స్థానంలో నిలిచింది.

పక్కా ప్రణాళికతో...

మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారులు మార్కెట్ ఫీజు, సెస్ వసూళ్లపై మార్కెట్ కమిటీ సిబ్బందికి ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తూ లక్ష్యాలను అధిగమించేలా చర్యలు చేపట్టారు. జిల్లాలోని ఆరు మార్కెట్ కమిటీల పరిధిలో 14 చెక్ పోస్టుల ద్వారా మార్కెట్ ఫీజు, సెస్ వసూళ్లను 94.37 శాతం వసూలు చేశారు. సివిల్ సప్లయిస్ బకాయిలు, ఏఎంసీకి రావలసిన బకాయిలు సుమారు రూ.70 కోట్లు రాకపోవడంతో లక్ష్యాలను అధిగమించలేకపోయాయి.

2024-25 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ ఫీజు,సెస్ వసూళ్ల వివరాలు (రూ.కోట్లలో)			
వ్యవసాయ మార్కెట్ కమిటీ	లక్ష్యం	వసూలు	పర్సంటేజీ
నిడదవోలు	1.50 కోట్లు	1.79 కోట్లు	119.62
గోపాలపురం	3.47 కోట్లు	3.82 కోట్లు	110.11
రాజానగరం	3.13 కోట్లు	3.43 కోట్లు	109.76
అనపర్తి	13.47 కోట్లు	13.58కోట్లు	100.86
రాజమహేంద్రవరం	4.21కోట్లు	3.32 కోట్లు	78.98
కొవ్వూరు	5.05 కోట్లు	3.13కోట్లు	62.03
మొత్తం	రూ.30.83 కోట్లు	రూ.29.09కోట్లు	94.37

రెండు ఏఎంసీలు వెనుకబడ్డాయి



జిల్లాలో అగ్రికల్చర్ మార్కెట్‌కమిటీల పరిధిలో మార్కెట్ ఫీజు, సెస్ వసూళ్లు 94.37 శాతం వసూలు చేశాం. మార్కెటింగ్‌శాఖ కమిషనర్, రీజనల్ డైరెక్టర్ మోటివేషన్‌తో నాలుగు ఏఎంసీలు వందశాతం పూర్తిచేయగా, రెండు ఏఎంసీలు వెనుకబడ్డాయి. సివిల్ సప్లయిస్ బకాయిలు సుమారు రూ.73 కోట్లు ఏఎంసీలకు రావాల్సి ఉంది. మార్కెట్ కమిటీ కార్యదర్శులు, సిబ్బంది సమష్టి కృషితో లక్ష్యానికి చేరువయ్యాం. జిల్లాలో వెనుకబడిన కొవ్వూరు, రాజమహేంద్రవరం మార్కెట్ కమిటీలు నూరుశాతం లక్ష్యం సాధించేలా కృషిచేస్తాం.

– ఎం.సునీల్‌వినయ్, జిల్లా అగ్రిట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారి, తూర్పుగోదావరిజిల్లా

రిజిస్ట్రేషన్‌కు రేపటి నుంచి స్లాట్ బుకింగ్



ఆర్.సత్యనారాయణ, జిల్లా రిజిస్ట్రార్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): డైనమిక్ క్యూ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (డీక్యూఎంఎస్) ద్వారా రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుకింగ్ శుక్రవారం నుంచి అందుబాటులోకి రానున్నట్లు జిల్లా రిజిస్ట్రార్ ఆర్ సత్యనారాయణ బుధవారం ఓప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ రాష్ట్రంలో డైనమిక్ క్యూ మేనేజ్ మెంట్ సిస్టమ్ ద్వారా రిజిస్ట్రేషన్ సేవలు అనగా దస్తావేజు దాఖలు చేసుకోవడానికి కక్షిదారులు అనుకూలమైన సమయం ఎంచుకొని ఆ సమయములో రిజిస్ట్రేషన్ సేవలు పొందవచ్చన్నారు. ఈ సేవలను శుక్రవారం నుంచి జిల్లాలో రాజమహేంద్రవరం ప్రధాన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అమలు చేస్తామన్నారు. స్లాట్ బుకింగ్‌ను పబ్లిక్ డేటా ఎంట్రీ విధానం ద్వారా గానీ, అధికారిక వెబ్ సైట్ రిజిస్ట్రేషన్.ఏపీ.జీవోవీ.ఇన్ స్లాట్ బుకింగ్ మాడ్యూల్ ద్వారా, క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా చేసుకోవచ్చన్నారు. రిజిస్ట్రేషన్‌కు స్లాట్ బుకింగ్ ద్వారా వేచి ఉండే సమయం తగ్గడంతో పాటు, సౌకర్యవంతమైన ప్రణాళిక, పారదర్శకతకు వీలవుతుందన్నారు. సిబ్బంది నిర్వహణ సులభతరం చేస్తూ దస్తావేజుల ముందస్తు పరిశీలనతో పాటు, మధ్యవర్తుల ప్రభావం తగ్గుతుందన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 - 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 - 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	15,500
గటగట (వెయ్యి)	14,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	14,500
గటగట (వెయ్యి)	13,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 - 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 - 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

డైట్ కళాశాలలో పోస్టుల భర్తీ

కొవ్వూరు: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని నల్లజర్ల మండలం దూబచర్లలో ఉన్న డైట్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న పోస్టులు ఎఫ్ఎస్‌టీసీ పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ తెలిపారు. కావున పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని అన్ని యాజమాన్యాలకు చెందిన ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మునిసిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, స్కూలు అసిస్టెంట్లు, ఉపాధ్యాయులు ఈ నెల 10వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.డీఈవో ఏలూరు.ఓఆర్‌జీ వెబ్‌సైట్‌లో ఉన్నాయన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

నల్లజర్ల: నల్లజర్ల - పోతవరం రహదారిలోని ఫ్లైఓవర్ కింద బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమె కుమార్తె క్షేమంగా బయట పడింది. వివరాల్లోకి వెళితే.. ఏలూరు తంగెళ్లమూడికి చెందిన బత్తుల రమణమ్మ (50) తన స్కూటీపై కుమార్తె మహాలక్ష్మితో కలిసి పశివేదల వెళుతోంది. మార్గం మధ్యలో నల్లజర్ల ఫ్లైఓవర్ వద్దకు వచ్చేసరికి పోతవరం నుంచి తాడేపల్లిగూడెం వెళుతున్న లారీ వేగంగా వీరి స్కూటీని ఢీకొట్టింది. ఈ ఘటనలో మహాలక్ష్మి రోడ్డు వైపు పడిపోగా, రమణమ్మ కాలిపై నుంచి లారీ టైరు వెళ్లిపోవడంతో నుజ్జునుజ్జయ్యింది. వెంటనే 108లో రమణమ్మను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రాంబాబు తెలిపారు.

అవగాహన లేకే..

బైపాస్ రహదారి గురించి అవగాహన లేకపోవడం వల్లే రమణమ్మ ప్రమాదం బారిన పడినట్టు స్థానికులు చెబుతున్నారు. ఏలూరులో బయలు దేరిన ఆమె గుండుగొలను వద్ద బైపాస్ రహదారిపై ఎక్కారు. ఆమె సరాసరి దేవరపల్లి వద్ద సర్వీసు రోడ్డు వద్ద దిగితే సరిపోయేది. అవగాహన లేకపోవడంతో నల్లజర్ల వద్ద సర్వీసు రోడ్డువద్ద దిగిపోయారు. మళ్లీ చెక్‌పోస్టు సెంటర్ నుంచి లక్ష్మీ మల్టీప్లెక్స్ వద్ద బైపాస్ ఎక్కే క్రమంలో ఈ ప్రమాదం బారిన పడ్డారు.

హత్య కేసులో ఇద్దరి అరెస్ట్

నల్లజర్ల: అల్లుడిని హత్య చేసిన మామ, బావమరిదిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ సోమరాజు తెలిపారు. నల్లజర్లకు చెందిన పేరం శ్రీనును సోమవారం రాత్రి అతడి మావ రేగుల వెంకన్న, బావమరిది శ్రీరామ్ కత్తితో నరికి చంపారు. తన కుమార్తెను తరచూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో నిందితులు ఇద్దరిని బుధవారం అరెస్ట్ చేసి తాడేపల్లిగూడెం కోర్టుకు హాజరపర్చగా, 15 రోజుల రిమాండ్ విధించారు.

బాలికా విద్యకు భరోసా

- కేజీబీవీలలో చక్కని విద్యాబోధన
- 6వ తరగతి నుంచి ఇంటర్ వరకూ అవకాశం
- ప్రవేశాలకు మొదలైన దరఖాస్తుల స్వీకరణ
- ఈ నెల 11 వరకూ గడువు

రాయవరం: పేద, అనాథ బాలికల కోసం ఏర్పాటు చేసిన కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ) వారి విద్యకు భరోసాగా నిలుస్తున్నాయి. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా బోధన చేస్తున్నాయి. వీటిలో ప్రవేశాలకు ఏటేటా డిమాండ్ పెరుగుతోంది. సాధారణ విద్యతో పాటు ఒకేషనల్, కంప్యూటర్ విద్యను సైతం ఇక్కడ అందిస్తున్నారు. ఆంగ్ల బోధనతో పాటు ఉచిత భోజనం, వసతి, పుస్తకాలు, యూనిఫాం తదితర సౌకర్యాలు అందిస్తున్నారు.



కస్తూర్బాగాంధీ విద్యాలయం

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ జిల్లాలోని నాలుగు కేజీబీవీల్లో ప్రవేశానికి విద్యార్థినులకు అవకాశం ఉంది.వీటిలో 6వ తరగతిలో ప్రవేశానికి మార్చి 27 నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. ప్రతి పాఠశాలలో 6వ తరగతికి 40 సీట్లు ఉన్నాయి. అలాగే ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు 160 సీట్లు కేటాయించారు. వీటికి ఉమ్మడి జిల్లా పరిధిలో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

కేజీబీవీల వివరాలు

జిల్లా సమగ్ర శిక్షా ప్రాజెక్టు కింద మైదాన ప్రాంతంలో తుని, కోటనందూరు, శంఖవరం, తొండంగిలలో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలున్నాయి. గతంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మైదాన ప్రాంతంలోని నాలుగు కేజీబీవీలతో పాటుగా రంపచోడవరం, మారేడుమిల్లి, గంగవరం, వై.రామవరం, ఎటపాక, కూనవరం, వీఆర్‌పురం, చింతూరులో కేజీబీవీలు ఉండేవి. జిల్లాల విభజన అనంతరం ఏజెన్సీ కేజీబీవీలు అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోకి వెళ్లాయి. ఇప్పుడు కేవలం కాకినాడ జిల్లా పరిధిలోని నాలుగు కేజీబీవీల్లో కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలోని విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశముంది.

ఏటా 40 మందికి అవకాశం

కేజీబీవీలలో ఏడాదికి 40 మంది వంతున 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 7, 8 తరగతుల్లో ఖాళీలను బట్టి సీట్లు కేటాయిస్తారు. జిల్లాలోని నాలుగు కేజీబీవీలో ఇంటర్ విద్యను ప్రవేశ పెట్టారు. శంఖవరం కేజీబీవీలో ఎంపీసీ, తుని, తొండంగి కేజీబీవీల్లో బైపీసీ, కోటనందూరు కేజీబీవీలో ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులున్నాయి.

వీరికి తొలి ప్రాధాన్యం

అనాథ బాలికలు, సింగిల్ పేరెంట్, పేద పిల్లలతో పాటు బడి బయట ఉన్న పిల్లలు, బడి మానేసిన వారు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న బాలికలకు తొలి ప్రాధాన్యత కింద కేజీబీవీల్లో ప్రవేశాలు కల్పిస్తారు. వలస కూలీల చిన్నారులు, కార్మిక శాఖ అధికారులు సిఫారసు చేసిన వారికీ ప్రవేశాల్లో ప్రాధాన్యం ఉంటుంది. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తారు. రాష్ట్ర స్థాయిలో స్క్రూటీనీ అనంతరం ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. ఎంపికైన విద్యార్థి మొబైల్‌కు ఎంపికైనట్లుగా సమాచారం వస్తుంది. 2018 నుంచి కేజీబీవీల్లో ఇంటర్ విద్యనూ అందుబాటులోకి తీసుకువచ్చారు.

ఫిమేల్ లిటరసీ రేటు ఆధారం

ఫిమేల్ లిటరసీ రేటు తక్కువగా ఉన్న మండలాలకు చెందిన విద్యార్థినులకు తొలి ప్రాధాన్యత ఇస్తారు. దాని ప్రకారం కాకినాడ జిల్లాలోని ఫిమేల్ లిటరసీ తక్కువగా ఉన్న మండలాల విద్యార్థినులకు అవకాశం ఉంటుంది. సీట్లు భర్తీ కాకపోతే కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలోని ఫిమేల్ లిటరసీ తక్కువగా ఉన్న మండలాల విద్యార్థినులతో భర్తీ చేస్తారు.

గుణాత్మక విద్యాబోధన

కేజీబీవీల్లో బాలికలకు క్వాలిఫైడ్ ఉపాధ్యాయులతో గుణాత్మక విద్యను అందిస్తున్నారు. వీటితో పాటు ఆంగ్ల మాధ్యమం కూడా బోధిస్తున్నారు. కార్పొరేట్ పాఠశాలలకు ఏ మాత్రం తీసిపోని విధంగా బోధన చేస్తున్నారు. రెగ్యులర్ పాఠ్యాంశాల బోధనతో పాటు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు, కంప్యూటర్ విద్య, క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు. విద్యతో పాటు కుట్లు, అల్లికలు, టైలరింగ్, బొమ్మల తయారీ, పేపర్లతో వివిధ రకాల నమూనాలు తయారు చేయడం నేర్పుతున్నారు. కబడ్డీ, టెన్నిస్, వాలీబాల్, సాఫ్ట్‌బాల్, హాకీ, టెన్నికాయిట్ తదితర క్రీడల్లో శిక్షణనిస్తున్నారు. నాలుగు కేజీబీవీల్లో ఒకేషనల్ కోర్సును 2023-24 నుంచి అందుబాటులోకి తీసుకుని వచ్చారు. 2024-25 నుంచి పాల్ ల్యాబ్స్ అందుబాటులోకి రాగా, ల్యాబ్‌లు, లైబ్రరీ రూమ్‌లను సిద్ధం చేస్తున్నారు.

ముఖ్యమైన తేదీలు

దరఖాస్తుల ప్రారంభం : 22 - 03 - 2025
స్వీకరణకు చివరి తేదీ : 11 - 04 - 2025
ప్రిపరేషన్ ఆఫ్ సెలక్షన్ జాబితా : ఏప్రిల్ 16
వెరిఫికేషన్ : ఏప్రిల్ 16 నుంచి 18 వరకూ..
6, 11 తరగతులకు ఎంపికైన విద్యార్థుల జాబితా: ఏప్రిల్ 21
ఎంపికైన వారి సర్టిఫికెట్ల వెరిఫికేషన్: ఏప్రిల్ 21 నుంచి 25 వరకూ..

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి



ప్రతి కేజీబీవీల్లో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుదారులు నేరుగా కాకుండా ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుల గడువు ముగియగానే పరిశీలన చేసి ప్రవేశాన్ని నిర్ణయిస్తాం. పేద విద్యార్థినులకు కేజీబీవీలో ప్రవేశం ఒక సువర్ణావకాశం. చదువు, ఆటపాటల్లో కేజీబీవీ విద్యార్థులు మెరుగైన ఫలితాలను సాధిస్తున్నారు.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

ఆహ్లాదకర వాతావరణం



కేజీబీవీల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. నిత్యం వైద్య సిబ్బంది పర్యవేక్షణలో విద్యార్థులు ఉంటారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ఉపాధ్యాయుల పర్యవేక్షణలో స్టడీ అవర్లు జరుగుతాయి. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ చూపిస్తారు.

– పి.ఉమామహేశ్వరి, జీసీడీవో, ఏపీ సమగ్ర శిక్షా, కాకినాడ

స్నానానికి దిగి మృత్యు ఒడికి..

- రెండు చోట్ల నలుగురి మృతి
- పెద్దనాపల్లి, కాండ్రకోట గ్రామాల్లోని ఏలేరు కాలువలో ప్రమాదం

ఏలేశ్వరం/పెద్దాపురం: ఏలేరు కాలువలో స్నానానికి దిగి నలుగురు మృత్యువాత పడ్డారు. అప్పటి వరకూ స్నేహితులు, కుటుంబ సభ్యులతో గడిపిన వారు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. పని కోసం వచ్చిన ఇద్దరు స్నేహితులు, అమ్మవారి దర్శనానికి వచ్చిన మేనమామ, మేనల్లుడు ఏలేరు కాలువలో మునిగిపోయారు. పెద్దనాపల్లి, కాండ్రకోట గ్రామాల్లో ఈ విషాద ఘటనలు జరిగాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగ్గంపేట గ్రామానికి చెందిన దేవర జీవన్ కుమార్ (19), మొల్లి వీర వెంకట దుర్గ (తరుణ్) (19), నీలాద్రి జగన్ కుమార్, దేవర దేవిశ్రీ ప్రసాద్, కొల్లిపోయిన విజయ్‌కుమార్, పత్రి సునీల్, వైభోగుల నారాయణమూర్తి బుధవారం కిర్లంపూడి మండలం ఎస్.తిమ్మాపురానికి తాపీపనికి వెళ్లారు. మధ్యాహ్న సమయంలో చల్లగా ఉంటుందని సమీపంలోని ఏలేశ్వరం మండల పరిధి పెద్దనాపల్లిలో ఉన్న ఏలేరు కాలువలో స్నానానికి దిగారు. అయితే ప్రమాదవశాత్తూ దేవర జీవన్ కుమార్, మొల్లి వీర వెంకట దుర్గ మునిగిపోయారు. మిగిలిన వారు సురక్షితంగా బయటపడి జగ్గంపేట పోలీసులకు సమాచారం అందించారు. ఏలేశ్వరం మండల పరిధి కావడంతో ఎస్సై రామలింగేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



వీరవెంకటదుర్గ (ఫైల్)



జీవన్ కుమార్ (ఫైల్)

కోనేటి వీధిలో విషాద ఛాయలు

జగ్గంపేట: పెద్దనాపల్లి వద్ద ఏలేరు కాలువలో మునిగి చనిపోయిన ఇద్దరు యువకులు జగ్గంపేటలోని కోనేటి వీధికి చెందిన వారు కావడంతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలముకున్నాయి. మొల్లి వీర వెంకట దుర్గ తాపీ మేస్త్రిగా పనిచేస్తున్నాడు. దేవాలయాలపై సిమెంట్‌తో దేవుళ్ల బొమ్మలను రూపొందించడంతో ఎంతో నైపుణ్యం ఉంది. అతడి తండ్రి రాంబాబు కొన్ని కారణాలతో కొంతకాలం క్రితం ఇల్లు విడిచి ఎక్కడికో వెళ్లిపోయాడు. దీంతో ఆ కుటుంబ భారాన్ని దుర్గ మోస్తున్నాడు. తల్లి రాజులు, చెల్లి గాయత్రిల బాగోగులు చూసుకొంటున్నాడు. ఇప్పుడు దుర్గ మృతి చెందడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది.


ఇంటర్ పరీక్షలు రాసి..

దేవర జీవన్ కుమార్ ఇటీవలే ఇంటర్మీడియెట్ పరీక్షలు రాశాడు. ప్రస్తుతం సెలవులు కావడంతో తాపీ పనికి వెళుతున్నాడు. అతడి తండ్రి వాసు తాపీమేస్త్రిగా పనిచేస్తున్నాడు. ఆయనకు ఇద్దరి కుమారులు. వారిలో జీవన్ చిన్నవాడు. బుధవారం మధ్యాహ్నం వరకు తాపీపని చేసిన జీవన్ తన స్నేహితులతో కలిసి ఏలేరు కాలువలో స్నానానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తూ మృతి చెందాడు.

నూకాలమ్మ దర్శనానికి వచ్చి..



వర్మ మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి



నాగ విశాల వర్మ (ఫైల్)



కొప్పాడ బాలు (ఫైల్)

కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి దర్శనానికి వచ్చిన ఓ కుటుంబానికి చెందిన బాలుడు, యువకుడు స్థానిక ఏలేరు నదిలో మునిగి మృతి చెందిన సంఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. యానానికి చెందిన కొప్పాడ సత్తిబాబు, తిరమాడి రాజు కుటుంబాలు ఈ నెల ఒకటిన అమ్మవారి దర్శనానికి వచ్చాయి. దర్శనం అనంతరం సమీపంలోని ఓ తోటలో వంటలు చేసుకుని, ఆనందంగా గడిపారు. ఈలోపు కొప్పాడ బాలు (20), అతడి మేనల్లుడు తిరమాడి నాగ విశాల వర్మ (8) ఏలేరు నదిలోకి స్నానానికి వెళ్లారు. అయితే సాయంత్రం అయినా వారిద్దరూ తిరిగిరాలేదు. దీంతో ఈ విషయాన్ని ఆ గ్రామ పెద్దలు, పెద్దాపురం పోలీసులకు సమాచారం ఇచ్చారు. రాత్రి పది గంటలు కావడంతో తర్వాత రోజు ఉదయాన్నే ఎస్ఐ మౌనిక, అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లతో ఏలేరు నదిలో గాలింపు చర్యలు మొదలుపెట్టారు.

మృతదేహాల లభ్యం

ముందుగా ఉదయం బాలుడు వర్మ మృతదేహం లభ్యమైంది. బాలు మృతదేహం సాయంత్రానికి నీటిపై తేలింది. దీంతో రెండు మృతదేహాలను పెద్దాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై పెద్దాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలుకు తల్లీతండ్రితో పాటు చెల్లి హారిక ఉంది. రైల్వే డిపార్ట్‌మెంట్‌లో చిరు ఉద్యోగంతో జీవనం సాగిస్తున్నాడు. వర్మ నాలుగో తరగతి చదువుతున్నాడు.

గంజాయి కేసులో ఎమ్మెల్యే అనుచరుడు

- పెదపూడిలో 10 మంది అరెస్ట్
- 5.265 కేజీల గంజాయి స్వాధీనం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: తాము అధికారంలో వస్తే గంజాయిని సమూలంగా నిర్మూలిస్తామనే కూటమి నేతల ఊకదంపుడు ప్రసంగాలు ఆచరణలోకి రాలేదు. దాదాపు పది నెలల ప్రభుత్వ పాలనలో ఎక్కడ చూసినా గంజాయి కేసులే కనిపిస్తున్నాయి. కూటమి నేతల అనుచరులు ఈ కేసులో పట్టుబడుతున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో గంజాయి అక్రమ రవాణాతో పాటు కాకినాడ, రాజమహేంద్రవరం వంటి నగరాలతో పాటు పట్టణాలు, పల్లెల్లో గంజాయి విక్రయాలు జరుగుతున్నా అడ్డుకట్ట మాత్రం పడడం లేదు. అనపర్తి నియోజకవర్గ పరిధిలో బీజేపీకి చెందిన ఎమ్మెల్యే అనుచరుడు దాసి గణేష్ గంజాయి కేసులో పోలీసులకు చిక్కడం చర్చనీయాంశంగా మారింది.

పోలీసుల దాడి

పెదపూడిలో గంజాయిని విక్రయిస్తున్న పది మందిని అరెస్ట్ చేసినట్టు పెదపూడి ఎస్సై కె.రామారావు బుధవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల ఒకటో తేదీన పెదపూడిలోని కైకవోలు సెంటర్‌లో ఉన్న ఒక షెడ్డు వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం వచ్చింది. కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్య కృష్ణ, కాకినాడ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ వి.కృష్ణ, ఎస్సైలు వినయ్ ప్రతాప్, కె.రామారావు, సిబ్బంది సహకారంతో దాడి చేశారు. ఈ దాడిలో గంజాయి విక్రయిస్తున్న 10 మంది ముఠా సభ్యులను పట్టుకున్నారు. వారి నుంచి 5.265 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ పది మందిలో ఒకడు మైనర్. మిగిలిన వారిలో గంగ్రేడుకు చెందిన అయిన విల్లి అశోక్, ఎస్.వెంకట సురేష్, కైకవోలుకు చెందిన ఎస్.రాహుల్, దాసి గణేష్, ఎల్లే ఎం.కుమార్, కరకుదురుకు చెందిన పిల్లి ప్రశాంత్, పెదపూడికి చెందిన కేవీ రాఘవేంద్ర, జి.మామిడాడకు చెందిన వి.విజయ కుమార్, యు.శ్రీనివాస్‌కుమార్ తదితరులు ఉన్నారు. నిందితుల్లో నలుగురి నుంచి తుని, నక్కపల్లి, కోరుకొండ, బొమ్మూరు, ధవళేశ్వరం, పెనుగొండ, ద్రాక్షారామ, తణుకు తదితర ప్రాంతాల్లో దొంగలించిన పది మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేయగా సీఐ దర్యాప్తు చేసినట్లు తెలిపారు. అలాగా వారిపై రౌడీ షీట్లు ఓపెన్ చేస్తామని ఎస్సై తెలిపారు.



అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డితో గంజాయి కేసు నిందితుడు గణేష్

కారు ఢీకొన్న ఘటనలో బాధితుడి మృతి

- భార్య పరిస్థితి విషమం
- వేట్లపాలెంలో విషాదఛాయలు

సామర్లకోట: హుస్సేన్‌పురంలోని వెంకట్రామ ఆయిల్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న గద్దె లక్ష్మణరావు (35) కాకినాడలోని ట్రస్టు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మైనర్లు కారు డ్రైవింగ్ చేయడంతో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటారు సైకిల్‌పై వేట్లపాలెం నుంచి కాకినాడ వెళుతున్న భార్యాభర్తలు తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. క్షతగాత్రులు గద్దె లక్ష్మణరావు, శిరీషలను కాకినాడ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ లక్ష్మణరావు మృతి చెందాడు. శిరీష పరిస్థితి కూడా విషమంగా ఉందని బంధువులు చెబుతున్నారు. లక్ష్మణరావు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పెద్దాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లక్ష్మణరావు మృతితో వేట్లపాలెం గాంధీనగర్‌లో విషాదఛాయలు అలముకున్నాయి. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.



గద్దె లక్ష్మణరావు (ఫైల్)

ఓడలరేవు సొసైటీ సీఈవో మృతి

- చికిత్స పొందుతూ మృత్యువాత
- హత్యగా మారిన హత్యాయత్నం కేసు

అమలాపురం టౌన్: అల్లవరం మండలం ఓడలరేవు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) సీఈవో సత్తి వెంకటేశ్వరరావు (60) కాకినాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఆయన ఓ మహిళ ట్రాప్‌లో పడి నగదు, బంగారం పోగొట్టుకుని, గడ్డి మందు కలిపిన మద్యాన్ని తాగడంతో తీవ్ర అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ మేరకు అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు బుధవారం మాట్లాడుతూ వెంకటేశ్వరరావు మృతి చెందారని మధ్యాహ్నం 2 గంటలకు సమాచారం వచ్చిందన్నారు. ఆయనపై హత్యాయత్నం చేశారన్న అభియోగంపై ట్రాప్ చేసిన మహిళను, సహకరించిన మరో ఇద్దరిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపర్చామన్నారు. ఇప్పుడు వెంకటేశ్వరరావు మృతి చెందడంతో హత్యాయత్నం కేసును హత్యగా మార్చినట్టు వెల్లడించారు. కాగా.. వెంకటేశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



సత్తి వెంకటేశ్వరరావు (ఫైల్)

ఫ్యాక్టరీ ప్రారంభం రోజునే కార్మికుడి మృతి

సామర్లకోట: స్థానిక ఏడీబీ రోడ్డులోని రిలయన్స్ బయో ఎనర్జీ ప్లాంట్‌లో బుధవారం కార్మికుడు మృతి చెందాడు. ఫ్యాక్టరీ ప్రారంభమైన రోజునే ఈ ఘటన జరగడంతో అంతటా విషాదం నెలకొంది. ఫ్యాక్టరీలో పనులు చేస్తున్న సమయంలో పైనుంచి పడి రంగనాథం నాగబాబు (40) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహన్ని పెద్దాపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పెద్దాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నాగబాబు మృతదేహం

డ్రైన్‌లో స్నానానికి దిగి వృద్ధుడు..

మామిడికుదురు: ఆదుర్రు గ్రామంలోని డ్రైన్‌లో మంగళవారం స్నానానికి దిగి కొమరాడలంకకు చెందిన బిరుదుగంటి నాగేశ్వరరావు (64) మృతి చెందాడు. ఈ విషయాన్ని నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్ బుధవారం విలేకరులకు తెలిపారు. అతడి కుమారుడు దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహానికి రాజోలు ప్రభుత్వాస్పత్రితో పోస్టుమార్టం నిర్వహించారన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

తుని: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఎదుట మోటారు సైకిల్‌పై వెళుతున్న యువకుడిని ఎదురుగా వస్తున్న బోలేరా వాహనం ఢీకొట్టడంతో మృతి చెందాడని తుని పట్టణ సీఐ ఎం.గీతారామకృష్ణ తెలిపారు. బుధవారం జరిగిన సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం. పాయకరావుపేట మండలం నామవరం గ్రామానికి చెందిన చందక శివ శంకర నారాయణ (29) ఎస్.అన్నవరం రోడ్డులో బైక్‌పై వెళుతున్నాడు. అతడిని తొండంగి మండలం నుంచి వస్తున్న బోలేరా వాహనం ఢీకొంది. ఈ ఘటనలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. రాంగ్ రూట్ వచ్చి యువకుడి ప్రాణాలను తీసిన బోలేరా వాహనం డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శివ శంకర నారాయణ తుని పట్టణంలోని ఎక్సైల్ బ్రాడ్‌బ్యాండ్‌లో టెక్నిషియన్‌గా పని చేస్తున్నాడు. అతడిని ఇటీవలే వివాహం జరిగింది.



శివ శంకర నారాయణ (ఫైల్)

క్రీడా సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం రూరల్/ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): పాటియాలాలోని నేతాజీ సుభాష్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్‌లో ఆరు వారాల స్పోర్ట్స్ కోచింగ్, సర్టిఫికెట్ కోర్సులో చేరేందుకు ఆసక్తి కల అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కోనసీమ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకులు పీఎస్ సురేష్ కుమార్, తూర్పుగోదావరి జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి డీఎంఎం శేషగిరి బుధవారం తెలిపారు.మే 6 నుంచి జూలై 2 వరకూ శిక్షణ జరుగుతుందన్నారు. ఆసక్తి కలవారు *https://www.6wcc.nsnis.in* ను పరిశీలించాలన్నారు. ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, బాక్సింగ్, సైక్లింగ్, కెనోయింగ్ కయాకిం, క్రికెట్, ఫుట్ బాల్, జిమ్నాస్టిక్స్, హ్యాండ్ బాల్, హాకీ, జూడో, కబడ్డీ, కోకో, రోల్ బాల్, రోయింగ్, సాఫ్ట్ బాల్, షూటింగ్, స్విమ్మింగ్, టైక్వాండో, టేబుల్ టెన్నిస్, లాన్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, ఊషు, యోగాసనాలు తదితర 29 క్రీడ అంశాలలో శిక్షణ ఉంటుందన్నారు.

దొంగ అరెస్టు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): క్యాష్ కౌంటర్‌లోని రూ.2.64 లక్షల అపహరించుకుపోయిన దొంగను ఒకటో పట్టణ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దానవాయిపేటలోని లక్ష్మీ ఫెర్టిలిటీ సెంటర్‌లో గత నెల 28న వంకాయల వీధికి చెందిన అక్కాబత్తుల గోవిందరాజు ప్రవేశించి, అక్కడి క్యాష్ కౌంటర్‌లో నగదును అపహరించుకుపోయాడు. దీనిపై బాధితుడు గవర సాయిరామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన పోలీసులు.. దొంగను పట్టుకుని నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందుతుడిని కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. కేసు త్వరితగతిన ఛేదించిన సీఐ ఎస్.మురళీకృష్ణ, సబ్ ఇన్‌స్పెక్టర్ జె.ఆదినారాయణ, హెడ్ కానిస్టేబుల్ కె.సురేష్, కానిస్టేబుళ్లు బి.గణేష్, ఎం.వెంకటేశ్‌లను ఎస్పీ, డీఎస్పీలు అభినందించారు.

చందువ చేప సాగు ఎంతో లాభదాయకం

- సీఎంఎఫ్‌ఆర్ఐ ప్రధాన శాస్త్రవేత్త జోకే కిజహకూడన్
- దానవాయిపేటలో విత్తనోత్పత్తి యూనిట్ ప్రారంభం

తొండంగి: చందువ చేపల పెంపకం ఎంతో లాభదాయకమని సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎంఎఫ్ఆర్ఐ) ప్రధాన శాస్త్రవేత్త జోకే కిజహకూడన్ అన్నారు. దానవాయిపేట వద్ద వైభవ్ హెచరీస్ (ఇండియా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చందువ చేప విత్తనోత్పత్తి కేంద్రాన్ని బుధవారం మండలంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చందువ చేపకు దేశ, విదేశాల్లో డిమాండ్ ఉందని, దీన్ని పెంచడానికి రైతులు ముందుకు రావాలని కోరారు. వైభవ్ హెచరీస్ మేనేజింగ్ డైరెక్టర్ బేటీ చంద్రశేఖర్ మాట్లాడుతూ విశాఖపట్నంలోని ఐకార్ - సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎంఎఫ్ఆర్ఐ) సుమారు 13 ఏళ్ల పాటు పరిశోధన చేసిన తర్వాత ఇండియన్ పాంపానో (చందువ చేప) పెంపకాన్ని దేశంలో అభివృద్ధి చేయాలని నిర్ణయించుకుందన్నారు. ఈ మేరకు తమతో సంప్రదించగా చందువ చేప విత్తనోత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించడానికి ముందుకొచ్చామన్నారు. శాస్త్రవేత్త జాయల్ మాట్లాడుతూ దేశంలోనే మొదటిసారిగా చందువ చేప విత్తనోత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. వీటిని చెరువులోనే కాకుండా కాలువలు, నదులు, సముద్రంలో కూడా పెంచవచ్చన్నారు. కార్యక్రమంలో వైభవ్ హెచరీస్ (ఇండియా) డైరెక్టర్లు బేటీ సాయి కపిల్ త్రిలోక్, బేటీ సాయి కపిల్ విఖ్యాత్, శాస్త్రవేత్తలు డాక్టర్ బీజీ జీవీఆర్, డాక్టర్ జయశ్రీ లోక, డాక్టర్ రితీష్ రంజన్, డాక్టర్ శేఖర్ మహాజన్, తొండంగి మండల మత్స్యకార సంఘం నాయకుడు రమణ, జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త జోకే కిజహకూడన్